# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 26-12-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 119 | పేజీలు:4 | వెల: రూ.1/-


## వేములవాడ మండలంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 25(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మండలంలో క్రిస్టమస్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజపల్లి గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి అతిథులుగా న్యాయవాది ఫాస్టర్ ప్రసాద్ గుడిసె సదానందం టీఆర్ఎస్ నాయకులు బుచ్చిబాబు ,కొమురయ్య కుమార్ హాజరై కేక్ కట్ చేసి మాట్లాడుతూ మానవాళి పాప పరిహారర్థమే యేసుక్రీస్తు జననమని అన్నారు. యేసుక్రీస్తు బోధనలు మానవాళికి ఆదర్శమని, శాంతికాముకునిగా చరిత్రలో నిలిచిపోయారని ఉపదేశించారు.ప్రేమ, త్యాగం, సమానత్వమనే సందేశం సమాజానికి అందించారని కొనియాడారు.

. ఈ కార్యక్రమంలో ఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు

## జమ్ముకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్ : జమ్మూకశ్మీరులో శనివారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. కశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో శనివారం జరుగుతున్న భీకర ఎన్‌కౌంటరులో ఇద్దరు గుర్తుతెలియని ఉగ్రవాదులు మరణించినట్లు జమ్మూకశ్మీర్ పోలీసులు వెల్లడించారు. తెల్లవారుజామున షోపియాన్ జిల్లా చౌగామ్ ప్రాంతంలో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఇంకా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు, పోలీసులు ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులు భద్రతా బలగాలపై కాల్పులు జరపారు. అలెర్ట్ అయిన బలగాలు.. ఎదురు కాల్పులు జరపడంతో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు పోలీసులు తెలిపారు.

## ఏసీబీ డీజీగా బాధ్యతలు చేపట్టిన అంజనీ కుమార్..

హైదరాబాద్, డిసెంబర్ 25:తెలంగాణ రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) డీజీగా అంజనీ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అంజనీ కుమార్‌కు ప్రస్తుత డీజీ గోవింగ్ సింగ్ బాధ్యతలు అప్పజెప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అంజనీ కుమార్ మాట్లాడుతూ.. ఏసీబీ డీజీగా బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఏసీబీలో పని చేసే ప్రతి ఒక్క అధికారి నిబద్ధతతో పని చేయాలని సూచించారు. అవినీతి నిర్మూలనకు కృషిచేస్తానని పేర్కొన్నారు. తనను ఏసీబీ డీజీగా నియమించేందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ కమిషనర్‌గా మూడేళ్లు పనిచేయడం సంతృప్తినిచ్చిందని తెలిపారు.

కరోనా మహమ్మారి సమయంలో హైదరాబాద్ సీపీగా విధులు నిర్వహించాను. అన్ని వర్గాల నుంచి పూర్తిస్థాయి సహకారం ఉంది. నాతో పాటు కలిసి మూడు సంవత్సరాల తొమ్మిది నెలల పాటు పనిచేసిన అధికారులకు, ప్రజలకు ధన్యవాదాలు. నేను సీపీగా ఉన్నప్పుడు ఎమ్మెల్యే, ఎంపీ, జీహెచ్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ముఖ్యమంత్రి యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళ్లాం. ప్రజలు కష్టకాలంలో ఉన్నప్పుడు మా డిపార్ట్మెంట్ ఎంతో సహాయ సహకారాలతో ముందుకెళ్లింది. హైదరాబాదులో ఒక మంచి సంస్కృతి ఉంది. ఆ సంస్కృతిని ఇన్నాళ్ల పాటు కంటిన్యూ చేశాను. ఏసీబీ డీజీగా నియమించి నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను. శాఖ పరంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం× అని అంజనీ కుమార్ ప్రకటించారు.

## ఒమిక్రాన్' కట్టడికి తెలంగాణ సర్కార్ ఆంక్షలు - 'మాస్క్' ధరించకపోతే కఠిన చర్యలు

హైదరాబాద్, డిసెంబర్ 25:తెలంగాణలో నూతన సంవత్సర వేడుకలపై ఆంక్షలు విధించారు. ఒమిక్రాన్ కట్టడికి ఆంక్షలు విధించింది తెలంగాణ సర్కార్. హైకోర్టు ఆదేశాలతో ఆంక్షలు విధించింది తెలంగాణ ప్రభుత్వం. నేటి నుంచి జనవరి 2వరకు ఈ ఆంక్షలు అమలు కానున్నాయి. జనవరి 2వరకు ర్యాలీలు, బహిరంగసభలపై నిషేధం విధించింది. మాస్క్ ధరించకపోతే కఠిన చర్యలు తప్పవని తెలిపింది. పబ్లిక్ ఈవెంట్లలో భౌతిక దూరాన్ని తప్పని సరి చేసింది. ఓమిక్రాన్ నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సర్కార్ సూచిస్తోంది.ఇటీవల ఓమిక్రాన్, కరోనా పరిస్థితులపై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా జనాలు గుమికూడకుండా.. పండగల సమయంలో కఠిన ఆంక్షలు విధించాలని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో ప్రభుత్వం ఆంక్షలు విధించింది.ఇప్పటికే మధ్య ప్రదేశ్, ఢిల్లీ, యూపీ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఓడిశా, హర్యానా రాష్ట్రాలు న్యూ ఇయర్ వేడుకలపై నిషేధం విధించాయి. నైట్ కర్ఫ్యూలు విధిస్తున్నాయి.

## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ

అమరావతి, డిసెంబర్ 25:సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. విజయవాడ నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన వేడుకల్లో రమణ పాల్గొని , కేక్ కట్ చేసి హోటల్ నిర్వాహకులు అందజేశారు. హోటల్‌కు విచ్చేసిన బిషప్‌లు.. క్రిస్మస్ సందర్భంగా జస్టిస్ ఎన్వీ రమణతో కేక్ కట్ చేయించారు. అనంతరం బిషప్‌లకు.. సీజేఐ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి, కేక్ తినిపించారు. ఈ వేడుకల్లో సీజేఐతోపాటుగా.. తెలుగు రాష్ట్రాల్లోని పలువురు జడ్జిలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి రమణ తన స్వగ్రామమైన కృష్ణాజిల్లా, వీరులపాడు మండలం పొన్నవరం గ్రామానికి శుక్రవారం విచ్చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రధాన న్యాయమూర్తికి ఘన స్వాగతం లభించింది. ఆయనకు అత్యంత ఇష్టమైన ఎడ్లబండిపై ఆయనను మేళతాళాల మధ్య ఊరేగించారు. దేశంలో అత్యంత గౌరవప్రదమైన స్థానంలో ఉన్నప్పటికీ తన మూలాలు ఈ గ్రామంలోనే ఉన్నాయని.. ఢిల్లీకి రాజైనా.. తాను ఎప్పటికీ పల్లె బిడ్డనే అని అన్నారు. గ్రామస్తులే తనకు తల్లిదండ్రులని, గ్రామాన్ని వదలి ఎంతో కాలమైనా, అత్యున్నత స్థానంలో ఉండి తన స్వగ్రామానికి రావడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. తనకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు రాజు, మార్కండేయులును ఆయన గుర్తుచేసుకున్నారు. ఇటువంటి అంకితభావం కలిగిన ఉపాధ్యాయులవల్లే తాను దేశ అత్యున్నత న్యాయస్థానానికి ప్రధాన న్యాయమూర్తి కాగలిగానన్నారు.

## బ్రిటన్ లో రికార్డు స్థాయిలో కొత్త పాజిటివ్ కేసులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: కరోనా మహమ్మారి విజృంభణతో బ్రిటన్ అల్లాడిపోతోంది. కొత్త వేరియంట్ ఒమిక్రాన్ వెలుగుచూసిన దగ్గరి నుంచి రికార్డు స్థాయిలో కొత్త పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. అక్కడ వరుసగా మూడోరోజు లక్షకు పైగా కొత్త కేసులు నమోదయ్యాయి. గత 24 గంటల వ్యవధిలో నమోదైన కేసుల సంఖ్య 1,22,186కి చేరింది. మరీ ముఖ్యంగా బ్రిటన్ రాజధాని లండన్‌లో కేసుల తీవ్రత ఎక్కువగా ఉంది. ఆఫీస్ ఫర్ నేషనల్ స్టాటిస్టిక్స్(ఓఎన్ఎస్) అంచనాల ప్రకారం.. డిసెంబర్ 16 నాటికి రాజధాని నగరంలో ప్రతి 20 మందిలో ఒకరు కొవిడ్ బారినపడి ఉండొచ్చని తెలిపింది. అలాగే ఆదివారం నాటికి ప్రతి పది మందిలో ఒకరు కొవిడ్ బారిన పడే అవకాశం ఉండొచ్చని ముందస్తు అంచనాలను వెల్లడించింది.

గత మూడు విడతల్లో కరోనా వైరస్ సృష్టించిన కల్లోలం అంతా ఇంతా కాదు. అయితే, గత వేరియంట్ల కంటే ఒమిక్రాన్‌తో ఆసుపత్రిలో చేరే ప్రమాదం తక్కువగా ఉందని ఇటీవల ఓ అధ్యయనం వెల్లడించింది. అయితే అక్కడి వైద్యులు మాత్రం పూర్తిస్థాయి సమాచారం అందుబాటులో లేనందున పరిస్థితిని జాగ్రత్తగా గమనిస్తున్నట్లు చెప్తున్నారు. ఇక, ఆ దేశంలో శుక్రవారం 137 మంది ప్రాణాలు కోల్పోయారు. ముందురోజు కంటే మరణాలు తగ్గాయి. ఇప్పటి వరకు బ్రిటన్ వ్యాప్తంగా మొత్తం 1,47,857 మంది మరణించారు. ఇది ఐరోపాలోనే అత్యధికం కావడం గమనార్హం.యూకే మొత్తంలో స్కాట్లాండ్‌లోనే ఇన్ఫెక్షన్ రేటు తక్కువగా ఉన్నట్లు ఓఎన్ఎస్ వెల్లడించింది. డిసెంబర్ 19 నాటికి అక్కడ ప్రతి 65 మందిలో ఒకరికి కరోనా సోకినట్లు తెలిపింది. ఇంగ్లండ్‌లో ప్రతి 35 మందిలో ఒకరికి ఈ వైరస్ సోకి ఉంటుందని అంచనా వేసింది. ఆదివారం నాటికి ఆ పరిస్థితి 25 మందిలో ఒకరు స్థాయికి చేరనుందని పేర్కొంది. మరోపక్క

## వాజ్ పేయీ అడుగుజాడల్లో అందరూ నడుద్దాం : బండి సంజయ్

హైదరాబాద్, డిసెంబర్ 25:నేడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి జయంతి. ఈసందర్భంగా నాంపల్లిలోని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి బీజేపీ నేతలు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్, బీజేపీ నేతలు రాజాసింగ్, విజయశాంతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ'సీఎం కేసీఆర్ పై తీవ్ర విమర్శలు గుప్పించారు.'తాను గొప్ప హిందువునని కేసీఆర్ చెప్పుకుంటున్నారు. ఈ భయంకర హిందువు తనయుడు కేసీఆర్ ఒక నాస్తికుడు. ముందు నీ కొడుకును భక్తుడిగా మార్చు కేసీఆర్. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వార్థంతో యాగాలు చేస్తుండొచ్చు. రాష్ట్రంలోని మంత్రులందరూ కూడా నాస్తికులే. అందుకే తెలంగాణ సమాజంలో హిందూ దేవుళ్లకి అవమానం జరుగుతోంది. హిందువుల మనోభావాలను దెబ్బతీసే ఇటువంటి చర్యలను ప్రజలు అడ్డుకోవాల్సిందే. కాబట్టి దయచేసి మిత్రులారా ఓ మంచి ఆలోచనతో ముందుకు వెళ్దాం. శక్తిమంతమైన, ప్రజాస్వామ్య విలువలు ఉన్న తెలంగాణగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుకుందాం. వాజ్ పేయీ అడుగుజాడల్లో అందరూ నడుద్దాం' అని బండి సంజయ్ పిలుపునిచ్చారు.


సుగుణ సాహితి సమితి సిద్ధిపేట

సిద్దిపేట జిల్లా స్థాయి ఉగాది బాలల కథల పోటీ - 2021

(ఆచార్య మర్వడగ చెన్నకృష్ణారెడ్డి, విశ్రాంత ఆచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం వారి సౌజన్యంతో)

బాలలలో సాహిత్యాభిరుచిని పెంపొందించడానికి, వారిలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడానికి సిద్దిపేట జిల్లా స్థాయిలో పాఠశాల విద్యార్థులకు గత సంవత్సరం కథల పోటీ నిర్వహించి బహుమతులు ప్రదానము చేసినాము. ప్రస్తుతము కూడా సిద్దిపేట జిల్లాలో చదువుచున్న పాఠశాలల విద్యార్థుల నుండి ఉగాది బాలల కథల పోటీ కి కథలను ఆహ్వానిస్తున్నాము.

బహుమతుల వివరాలు :

ప్రథమ బహుమతి : 1500/-

ద్వితీయ బహుమతి : 1000/-

తృతీయ బహుమతి (2) : 500/-

9 ప్రోత్సాహక బహుమతులు - ఒక్కొక్కటి : 300/-

నియమ నిబంధనలు :

* కథలు ఆహ్లాదాన్ని కలిగిస్తూ, ఆలోచనలను రేకెత్తించే విధంగానూ, బంధాలు, కరుణ, దయ కలిగిఉండేలా, కథలు మన సంస్కృతిని ప్రతిబింబించేలా ఉండాలి. నీతిని బోధించేలా ఉండాలి.
* కథల నిడివి చేతివ్రాతలో మూడు పేజీలు, డి.టి.పి.లో రెండు పేజీలు మించరాదు.
* పోటీకి పంపించే కథలు ఇదివరలో ఏ పత్రికలోనూ ప్రచురణ కానివి, వాట్సప్ / బ్లాగులలో పలిశీలనలో లేనివి, కథ తమ స్వంతమేనని హామీ పత్రం తప్పనిసరిగా జతపరచాలి. హామీ పత్రంపై ప్రధానోపాధ్యాయులు / ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులు లేదా తల్లిదండ్రుల సంతకం ఉండవలెను.
* కథల ఎంపికలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం. ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు.
* కథలను స్వయంగా కాని, రిజిస్టర్ పోస్టు ద్వారా గాని, కొరియర్ ద్వారా గాని మాత్రమే స్వీకరిస్తారు.
* మార్చి 2021 చివరి వారం / ఏప్రిల్ మొదటి వారంలో బహుమతుల ప్రధానం జరుగును.
* కథలు పంపాల్సిన చివరి తేది. 10 ఫిబ్రవరి, 2021.

కథలు పంపాల్సిన చిరునామా : కన్వీనర్, ఉగాది బాలల కథల పోటీ
ప్రతిభ డిగ్రీ కళాశాల, సిద్దిపేట - 502 103. సెల్ : 9959007914

అధ్యక్షులు : మొసర్ల మాధవరెడ్డి, సుగుణ సాహితి సమితి

కన్వీనర్ : ఖైతి దుర్గయ్య, సుగుణ సాహితి సమితి



ఆహ్వానం

తెలుగు భాషా చైతన్య సమితి
శ్రీ త్యాగరాయ గానసభ
లక్ష్య సాధన ఫౌండేషన్
సంయుక్త ఆధ్వర్యంలో



శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వైభవం
కవితా సంకలనం ఆవిష్కరణ సభ

మరియు

తెలుగు భాషా చైతన్య సమితి వార్షికోత్సవ పురస్కారాల ప్రదానోత్సవం

తేది : 26-12-2021, ఆదివారం, ఉ॥ 10 గం॥లకు
వేదిక : శ్రీ త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్

ముఖ్యఅతిథులు :
డా॥ కె.వి.రమణాచారి, ఐ.ఏ.ఎస్.(రి.) తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు
డా॥ ఏనుగును నరసింహారెడ్డి మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్

సభాధ్యక్షులు :
శ్రీ పి.బడేసాబ్ ఫౌండర్, తెలుగు భాషా చైతన్య సమితి

విశిష్ట తిథులు :
శ్రీ కళా వి.ఎస్.జనార్దనమూర్తి అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ
శ్రీ రాచాల యుగంధర్ గౌడ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బి.సి. సంక్షేమ సంఘం
శ్రీమతి బి.రాజారత్నం అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు
శ్రీ నక్క శ్రీనివాసులు ఛైర్మన్, నక్క శ్రీనివాస్ యాదవ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్

గౌరవ అతిథులు :
శ్రీ గంటా మనోహర్ రెడ్డి ప్రముఖ కవి, విమర్శకులు
శ్రీ అల్ల రామకృష్ణ ముఖ్య సలహాదారులు, తెలుగు భాషా చైతన్య సమితి
శ్రీ ప్రజ్ఞా రాజు ఛైర్మన్, లక్ష్య సాధన ఫౌండేషన్
శ్రీ కె.రాజగోపాల నాయుడు సలహాదారులు, తెలుగు భాషా చైతన్య సమితి

తెలుగు భాషా చైతన్య సమితి పురస్కార స్వీకర్తలు

డా॥ ఆలేటి మోహన్ రెడ్డి విశ్రాంత అధ్యాపకులు

డా॥ చీదెల్ల సీతాలక్ష్మి విశ్రాంత అధ్యాపకులు

డా॥ ఎడ్ల కల్లేష్ ప్రధాన కార్యదర్శి, తెలుగు భాషా చైతన్య సమితి

బి.వెంకటేశ్వర్లు అధ్యక్షులు, తెలుగు భాషా చైతన్య సమితి

సభా సమన్వయం
డా॥ వి.జయప్రకాశ్, పిట్టేటి మల్లికార్జున్, జె.బి.జె.సత్యం సాగర్, టి.సురేష్, ఆవ మల్లయ్య, కె.సత్యనారాయణ, బాటసారి ఎస్.వి.నాయక్, నకిరేకంటి శ్రీనయ్య, డా॥ మంగళగిరి శ్రీనివాసులు, జి.భరత్‌కుమార్, కె.వి.జనార్దన్



చరిత్రలో నేటినిజం

కం॥ అంకిత భావమునన్ - సత్
యంతమ్ముగ సేవలాడిన రాష్ట్రాధిపతిన్
"శంకర దయా ఆశ్రమ"ను
స్థంభింపని సూక్ష్మం దటంచు గొలిచెదను వెసన్!

(డిసెంబర్ 26 శంకర దయాళ్‌శర్మ పుణ్యతిథి..)

-రాధశ్రీ

సెల్: 9494481210

# 'అగ్ని'ని చిమ్ముతూ.. 'ప్రళయ'న్ని సృష్టిస్తూ దూసుకెలుతున్న క్షిపణులు

## (అగ్ని-పి, ప్రళయ్ మెసైల్స్‌ను డిఆర్‌డిఓ విజయవంతంగా ప్రయోగించిన సందర్భంగా)

'అగ్ని' కీలలు చిమ్ముతూ 'ప్రళయం' సృష్టించడానికి స్వదేశీ క్షిపణులు వాయువేగంతో దూసుకుపోవడానికి సిద్ధం అవుతున్నాయి. భారత రక్షణ అమ్ముల పొదిలో మరిన్ని అత్యాధునిక క్షిపణి అస్త్రాలు చేరాయి. ఇరుగుపొరుగు దేశాల, ముఖ్యంగా డ్రాగన్, పాక్ వెన్నుల్లో వణుకు పుడుతున్నది.

### అగ్ని-ప్రైమ్ క్షిపణి:

స్వదేశీ పరిజ్ఞానంతో డిఆర్‌డిఓ (డిఫెన్స్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అత్యాధునిక 'అగ్ని-ప్రైమ్' క్షిపణిని 18 డిసెంబర్ 2021న, ప్రళయ్ క్షిపణిని 22 డిసెంబర్ 2021న విజయవంతంగా పరీక్షించడంతో దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఇంతకు పూర్వం 2016 నుంచి భారత్ ప్రయోగించిన అగ్ని-1తో మె?దలు అగ్ని-5 వరకు ఐదు క్షిపణుల కన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన మీడియమ్-రేంజ్ బాలిస్టిక్ మెసైల్‌గా న్యూక్లియర్ వార్‌హెడ్ (అణ్వాయుధాలను ప్రయోగించగల)లను మోసుకుపోగల సౌకర్యం కలిగిన అగ్ని-పి రాకతో భారత రక్షణరంగం మరింత బలాన్ని పొందగలిగింది. ఇతర క్షిపణులతో పోల్చితే అగ్ని-పి మెసైల్ సులభంగా రోడ్డు, రైలుల్లో కూడా రవాణ చేయగలగడం, కానిస్టర్‌లో నిల్వ చేయడం లాంటి సుగుణాలను కలిగి ఉంది. తొలిసారి 28 జూన్ 2021న అగ్ని-పి క్షిపణిని ఒరిస్సాలోని బాలసోర్ సమీప 'ఏపిజె అబ్దుల్ కలాం ఐలాండ్' నుండి నిర్దేశించిన లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించగలిగారు. 3-దశల ఘన ఇంధన అగ్ని-పి క్షిపణి ప్రత్యేకతగా 'యంఏఆర్‌వి (మాన్యూవెరబుల్ రీన్‌ట్రీ వెహికిల్)' సామర్థ్యాన్ని కలిగి ఉండడమే అని శాస్త్రజ్ఞులు వెల్లడిస్తున్నారు.

పాకిస్థాన్, చైనా దుకుడుకు ముక్కు తాడు వేయడానికి అగ్ని-పి నిర్మించబడింది. అగ్ని-పి క్షిపణి ద్వారా 1,500 - 3,000 కిలోల వార్‌హెడ్ సామర్థ్యం కలిగి, 1,000-2,000 కిమీ దూర లక్ష్యాన్ని సులభంగా మట్టు పెట్టవచ్చు. ఈ క్షిపణి ప్రయోగంతో పాకిస్థాన్‌లోని ఏ లక్ష్యానైనా సులభంగా చేరవచ్చని తెలుపుతున్నారు. టెలిమెట్రీ, రాడార్, ఎలక్ట్రో-ఆప్టికల్ స్టేషన్స్, డౌన్‌రేంజ్ షిప్స్ సహాయంతో పర్యవేక్షించగల అగ్ని-పి క్షిపణి ఇతర అగ్ని మెసైల్స్ కన్న అధిక ఖచ్చితత్వంతో చేరగల పలు ప్రయోజనాలను కలిగి ఉంది. దేశంలోని ఏ భాగానైనా సులభంగా రవాణా చేయగలిగిన 'న్యూ జనరేషన్ న్యూక్లియర్ కాపబుల్ బాలిస్టిక్ మెసైన్'గా అభివర్ణింపబడుతున్న ఉపరితలం నుంచి ఉపరితలానికి (సర్ఫేస్-టు-సర్ఫేస్) ప్రయోగించగల అతి చిన్న సైజు, తక్కువ బరువు ఉన్న అగ్ని-పి క్షిపణి ప్రయోగాన్ని స్వల్పకాలంలో సునాయాసంగా చేయవచ్చు.

### ప్రళయ్ క్షిపణి:

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించి 22/23 డిసెంబర్ 2021ల్లో రెండుసార్లు వరుసగా ఒడిసాలోని ఏపిజె అబ్దుల్ కలాం ఐలాండ్ నుంచి విజయవంతంగా ప్రయోగించిన తొలి సాంప్రదాయ కానిస్టరైజ్డ్ సర్ఫేస్-టు-సర్ఫేస్ టాక్టికల్ షార్ట్-రేంజ్ బాలిస్టిక్ మెసైల్స్ (యస్ఆర్‌బియం)ను ఇండియన్ ఆర్మీ యుద్ధక్షేత్రంలో వినియోగించడానికి ఉద్దేశించబడినదిగా ప్రళయ్ క్షిపణికి పేరుంది. తీవ్ర పేలుడు పదార్థాలను ప్రయోగించగల 500-1,000 కెజీల వార్‌హెడ్ సామర్థ్యంతో 5 టన్నుల బరువు కలిగిన ప్రళయ్ క్షిపణిలో రెండంచల ఘన ఇంధన మోటార్లు దూసుకెళ్లగలిగిన సామర్థ్యం ఉన్న ప్రళయ్ క్షిపణి 150-500 కిమీ రేంజ్ లక్ష్యాలను సులభంగా ఛేదించగలుగుతుంది. ఇప్పటి వరకు భారత అమ్ములపొదిలో ఉన్న 'బ్రహ్మోస్' సూపర్‌సోనిక్ క్రూజ్ మెసైల్ రేంజ్ 500 కిమీ, పేలోడ్ 200 కెజీలు ఉన్నది. అత్యంత ఖచ్చితత్వం, ప్రాణాంతకమైన అధిక బరువును మోయగల ప్రళయ్ క్షిపణి చేరడంతో భారత సైన్యానికి మరింత బలం చేకూరినట్లు అయ్యిందని నిపుణులు తెలపడం హర్షదాయకం.

### అగ్ని 1-6 క్షిపణులు:

డిఆర్‌డిఓ రూపొందించిన అగ్ని క్షిపణుల శ్రేణిలో ఇప్పటి వరకు అగ్ని-1 నుంచి అగ్ని-5 వరకు విజయవంతంగా ప్రయోగించగల భారత్ ఇటీవల అగ్ని-పి మెసైల్‌ను ప్రయోగించింది. 1989లో ప్రయోగించిన అగ్ని-1 పరిధి 7,00-1,200 కిమీ, 1999లో ప్రయోగించిన అగ్ని-2 రేంజ్ 2,000-3,500 కిమీ ఉంది. జూన్ 2006లో ప్రయోగించిన అగ్ని-3 క్షిపణి పరిధి 3,000-5,000 కిమీ, నవంబర్ 2011లో ప్రయోగించిన అగ్ని-4 రేంజ్ 3,500-4,000 కిమీగా నిర్మితమైనాయి. ఏప్రిల్ 2012లో ప్రయోగించిన అగ్ని-5 మెసైల్ రేంజ్ 5,000-8,000 కిమీ ఉంటూ అంతర్‌ఖండాల బాలిస్టిక్ క్షిపణిగా పేరు తెచ్చుకుంది. 8,000-12,000 కిమీ రేంజ్ కలిగిన అగ్ని-6 పేరుతో అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మితం అవుతున్న ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్ క్షిపణిని సబ్‌మెరైన్ లేదా ల్యాండ్‌పై నుంచి ప్రయోగించగల మెసైల్‌ను రాబోయే రోజుల్లో డిఆర్‌డిఓ తేనున్నది.

అణ్వాయుధాలను కూడా ప్రయోగించగలిగిన స్ట్రాటజిక్ అగ్ని-ప్రైమ్, ప్రళయ్ క్షిపణులు చేరడంతో భారత రక్షణ శాఖ పొరుగు దేశాలకు తీవ్ర హెచ్చరికలు చేసినట్లు అయ్యింది. అగ్ని-5తో చైనా, అగ్ని-పితో పాకిస్థాన్ వెన్నులో వణుకు పట్టడం ప్రారంభమైంది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని శత్రు లక్ష్యాలను టార్గెట్ చేయగల అగ్ని-ప్రైమ్, ప్రళయ్ క్షిపణులు రాకతో భారత రక్షణ భుజాలు దృఢమై, శత్రు దేశాలను ఆత్మరక్షణలో పడేసినట్లు అయ్యింది. కయ్యానికి కాలు దువ్వే పాకిస్థాన్, తల తిక్క చైనా దేశాల చేతులు కట్టివేయడానికి అగ్ని-1 నుంచి అగ్ని-పి, ప్రళయ్ క్షిపణులు దోహదపడతాయని, జాతి భద్రతకు ఎలాంటి ముప్పులేదని ఆశిద్దాం. స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మితమైన అగ్ని, క్షిపణులను విజయవంతంగా ప్రయోగించిన డిఆర్‌డిఓ- హైదరాబాద్‌ను అభినందిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఇండియాలో భారీ స్క్రీన్ మూసివేత

న్యూఢిల్లీ, డిసెంబర్ 25:ఇండియాలో భారీ స్క్రీన్ పై ఏపీలో టిక్కెట్స్ రేట్ల ఇష్యూ ప్రభావం పడింది. ప్రపంచంలో మూడో భారీ స్క్రీన్ గా పేరొందింది వి ఎపిక్ సినిమా థియేటర్. వంద అడుగుల వెడల్పు, యాభైనాలుగు అడుగుల ఎత్తు, 650మంది సీటింగ్ కెపాసిటీ వి ఎపిక్ సొంతం. వి ఎపిక్ కి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. సౌత్ ఆసియాలోనే బిగ్గెస్ట్ స్క్రీన్ ఇది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో ఉంది. రూ. 40 కోట్లతో దీనిని నిర్మించారట. నెల్లూరు జిల్లావాసులు మాత్రమే కాదు, చెన్నైకి దగ్గరలో ఉండటంతో అటు ఇటు ప్రయాణాలు చేసే ప్రజలు సైతం ఆ థియేటర్లో సినిమా చూడటానికి ఆసక్తి చూపిస్తారు. సాహో సినిమాతో ఈ థియేటర్‌లో షోలు మొదలయ్యాయి. దీనికి మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రారంభించారు.

ఏపీలో టికెట్ రేట్స్ ప్రభావంతో ఆ థియేటర్ మూతపడింది..ఇండియాలో, సౌత్ ఆసియాలో భారీ స్క్రీన్ అయినప్పటికీ? కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి థియేటర్ నిర్మించినప్పటికీ? గ్రామ పంచాయతీలో థియేటర్ ఉంది. దాంతో ఏపీ ప్రభుత్వం చెప్పిన రేట్లకు టికెట్లు అమ్మాల్సిన పరిస్థితి. గ్రామ పంచాయతీ పరిధిలో రూ 5, 10, 15 రూపాయల రేట్లను ప్రభుత్వం ఫిక్స్ చేశారు. ఆ రేట్లకు టికెట్లు అమ్మడం కంటే థియేటర్ మూసి వేయడం వల్ల వచ్చే నష్టాలు తక్కువ అని యాజమాన్యం భావించింది. దాంతో తెరపై సినిమాలు ప్రదర్శించడం మానేసి, మూసేసింది. మరి ఎప్పటికి తెరుచుకుంటుందనే విషయం తెలియాల్సి ఉంది.

# జాయెల్‌లో సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు.. వచ్చే ఏడాది రోడ్డెక్కనున్న ఎలక్ట్రిక్ టాక్సీలు..

న్యూఢిల్లీ, డిసెంబర్ 25:జీరో రోడ్ యాక్సిడెంట్స్, కాలుష్య రహిత వాహనాలపై ప్రత్యేకమైన శ్రద్ధ చూపుతున్నట్టు ఇజ్రాయెల్ ప్రభుత్వం తెలిపింది. ఈ క్రమంలో పార్లమెంటు ఆర్థిక వ్యవహారాల కమిటీకి రవాణా మంత్రిత్వ శాఖ కొన్ని ప్రతిపాదనలు సమర్పించిందని అక్కడి అధికారులు తెలిపారు. అవి ఆమోదం పొందడంతో అటానమస్ సెక్టార్ కింద ఎలక్ట్రానిక్ వాహనాలు, డెవలప్ మెంట్ వంటివి పర్యవేక్షణలో ఉండనున్నాయి. తొలుత ఇది ట్యాక్సీలకు మాత్రమే పరిమితం చేయనున్నట్టు తెలిపారు.

కాగా, వచ్చే ఏడాది ప్రారంభంలో దేశవ్యాప్తంగా ఎలక్ట్రానిక్ ట్యాక్సీలు అందుబాటులోకి తెచ్చేలా ప్రతిపాదించిన ముసాయిదా చట్టాన్ని అక్కడి పార్లమెంట్ ఆమోదించింది. పార్లమెంటు ఆర్థిక వ్యవహారాల కమిటీకి సమర్పించిన ప్రతిపాదిత రవాణా మంత్రిత్వ శాఖ చట్టం ఇజ్రాయెల్‌లో స్వయంప్రతిపత్త రంగాన్ని ఏర్పాటు చేసింది.

జీరో యాక్సిడెంట్స్, కర్బన ఉద్గారాలు లేనివిధంగా.. రద్దీని తగ్గించే లక్ష్యంతో 640 ఇజ్రాయెలీ స్టార్టప్‌లు ఇప్పటికే అటానమస్ విభాగంలో పనిచేస్తున్నాయని మంత్రిత్వ శాఖలోని అధికారి అవ్నర్ ఫ్లోర్ తెలిపారు. "రాబోయే దశాబ్దంలో, ఈ వాహనాలు ప్రధానంగా ప్రజా రవాణా కోసం ఉపయోగిస్తాం. ప్రైవేట్ వాహనాలకు తక్కువగా కేటాయిస్తాం" అని ఆయన చట్టసభ సభ్యులతో అన్నారు.

కెమెరాలు, సెన్సార్‌లతో కూడిన సుమారు 40 సెల్ఫ్ డ్రైవింగ్ వాహనాలు ఇప్పటికే ఇజ్రాయెల్ రోడ్లపై ఉన్నాయని.. పలు కంపెనీలు వాటిని టెస్ట్ చేస్తున్నాయని, ఆ తర్వాత ఆమోద ప్రక్రియ ఉంటుందని ఫ్లోర్ తెలిపారు. వచ్చే ఏడాది ప్రారంభంలోనే సెల్ఫ్ డ్రైవింగ్ పటిల్ ఆపరేషన్ ప్రారంభమవుతుందని, ఈ రంగంలో ఇజ్రాయెల్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డిపార్ట్ మెంట్ (ఆర్ అండ్ డి) టాక్సీ డ్రైవర్లకు పూర్తిగా సహకరిస్తుందని ఆయన అన్నారు.

# కోవిడ్ నెగెటివ్ సర్టిఫికెట్ ఉంటేనే తిరుమలకు అనుమతి

తిరుమల,డిసెంబర్ 24: తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు వ్యాక్సినేషన్ సర్టిఫికేట్ కానీ, దర్శనానికి 48 గంటల ముందు చేసుకున్న ఆర్‌టిపిసిఆర్ పరీక్ష నెగిటివ్ సర్టిఫికేట్ కానీ తప్పనిసరిగా తీసుకురావాలని టీటీడీ కోరుతోంది. ఇదివరకే టీటీడీ ఈ విషయాన్ని తెలియజేసిన విషయం విదితమే. కొంతమంది భక్తులు నెగిటివ్ సర్టిఫికేట్ లేకుండా స్వామివారి దర్శనం కోసం వస్తుండడంతో అలిపిరి చెక్ పాయింట్ వద్ద నిఘా అండ్ భద్రతా సిబ్బంది తనిఖీ చేసి అటువంటి వారిని వెనక్కు పంపాల్సి వస్తోంది. దీనివలన అనేకమంది భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోవిడ్ ? 19 మూడవ వేవ్ ఒమిక్రాన్ రూపంలో దేశ వ్యాప్తంగా విస్తరిస్తున్న నేపథ్యంలో హెచ్చరికలు జారీ చేసింది. ఖచ్చితంగా వ్యాక్సినేషన్ సర్టిఫికేట్ లేదా దర్శనానికి 48 గంటల ముందు చేసు కున్న ఆర్‌టిపిసిఆర్ పరీక్ష నెగిటివ్ సర్టిఫికేట్‌ను అలిపిరి చెక్ పాయింట్ వద్ద చూపించిన వారిని మాత్రమే తిరుమలకు అనుమతిస్తారు అధికారులు. కావున భక్తులు, ఉద్యోగులు, వేలాది మంది సహ భక్తుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని టీటీడీ విజిలెన్స్, సెక్యూరిటి సిబ్బందికి సహకరించాలని కోరడమైనది. టీటీడీకి సంబంధించిన ఇతర ఆలయాల్లో కూడా ఈ కోవిడ్ నిబంధనలు విధిగా పాటించాలని భక్తులను కోరడమైనది.

# స్టార్ రేటింగ్ ప్రొటోకాల్.తో కొత్త ప్రణాళిక ప్రారంభం..

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: దేశంలోని నగరాలను చెత్తరహితంగా తీర్చిదిద్దేందుకు సంబంధించిన కొత్త ప్రొటోకాల్ ఈ రోజు ప్రారంభమైంది. 'చెత్త రహిత నగరాలు-టూల్ కిట్ 2022, ఆజాదీఏ75 స్టార్ రేటింగ్ ప్రోటోకాల్' పేరిట ఈ రోడ్.మ్యాప్.ను, టూల్ కిట్.ను ఆవిష్కరించారు. "సుపరిపాలనా దినోత్సవం" సందర్భంగా కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎం.ఒ.హెచ్.యు.ఎ.) ఈ నూతన ప్రొటోకాల్.కు శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా చెత్త రహిత నగరాలను తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా వ్యర్థాల నిర్వహణకు దోహదపడే అతి కీలకమైన పరిపాలనా ఉపకరణంగా ఈ టూల్ కిట్.ను రూపొందించారు.

పట్టణ ప్రాంతాలకోసం ఉద్దేశించిన స్వచ్ఛభారత్-అర్బన్ రెండవ దశ పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2021 అక్టోబరు ఒకటవ తేదీన ప్రారంభించారు. "చెత్త రహిత నగరాలు" (జి.ఎఫ్.సి.) సృష్టించడం, తద్వారా సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణతో, వ్యర్థాల నిర్వహణతో భారతదేశాన్ని నూతన ప్రగతి పథంలో నడిపించడం అన్న దార్శనికతతో ప్రధాని ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ విషయంలో ప్రధానమంత్రి కలలను సాకారం చేసేందుకు ప్రతి పట్టణ స్థానిక పరిపాలనా సంస్థనూ చెత్త రహితంగా తీర్చిద్దడంలో 3 స్టార్ రేటింగ్ సాధించడమే స్వచ్ఛ భారత్ అర్బన్ రెండవ దశ ధ్యేయంగా నిర్దేశించుకున్నారు.

చెత్త రహిత నగరాలకు ప్రక్రియకు సంబంధించిన సర్టిఫికేషన్ ప్రక్రియ ఇటీవలే ముగిసింది. పట్టణ స్థానిక పరిపాలనా సంస్థల్లో 50శాతం (అంటే 2,238 నగరాలు) ఈ సర్టిఫికేషన్ ప్రక్రియలో పాలుపంచుకున్నాయి. ప్రక్రియలో పాలుపంచుకున్న నగరాల్లో 299 నగరాలకు చెత్తరహిత నగరాలుగా యోగ్యతా పత్రాలను జారీ చేశారు. చెత్త రహిత స్థాయిలో,.. 9 నగరాలకు ఫైవ్ (5) స్టార్ రేటింగ్, 143 నగరాలకు త్రీ (3) స్టార్ రేటింగ్, 147 నగరాలకు వన్ (1) స్టార్ రేటింగ్ లభించింది.

'చెత్త రహిత నగరాలు' ఏర్పాటు చేయడమే లక్ష్యంగా వివిధ నగరాల్లో వ్యర్థాల నిర్వహణకు సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితిని మెరుగుపరచడంలో స్టార్ రేటింగ్ సర్టిఫికెట్ జారీ ప్రక్రియ ప్రభావాన్ని పరిశీలించిన అనంతరం భారత ప్రభుత్వ నిధుల విడుదల ప్రక్రియకు కొన్ని షరతులు విధించింది. ఏదైనా పట్టణ పరిపాలనా సంస్థ కనీసం ఒక్కటైనా స్టార్ సర్టిఫికేషన్ సాధించి ఉండాలన్న షరతును విధించారు. పట్టణ ప్రాంతాలకు సంబంధించిన ప్రతి పట్టణ స్థానిక సంస్థ కేంద్ర నిధులను పొందాలన్నా, స్వచ్ఛ భారత్ అర్బన్ పథకం రెండవ దశ కింద అనుకున్న లక్ష్యాలు సాధించాలన్నా సదరు స్థానిక పరిపాలనా సంస్థలు ఈ సర్టిఫికేషన్ ప్రక్రియలో పాల్గొని, చెత్తరహిత నగరాల రేటింగ్ సాధించాల్సి ఉంటుంది. ఇందుకోసం చెత్త రహిత నగరాల ఏర్పాటుకు ప్రస్తుతం పాటిస్తున్న నియమ నిబంధనలను పూర్తిగా ప్రక్షాళన చేసి, మధింపు ప్రక్రియను సరళతరం చేయడం అవసరమని భావించారు. తద్వారా జి.ఎఫ్.సి. సర్టిఫికేషన్ ప్రక్రియకోసం దరఖాస్తు చేసుకునేలా ప్రతి పట్టణ స్థానిక సంస్థనూ కార్యోన్ముఖం చేయవచ్చని భావించారు.

సవరించిన ప్రొటోకాల్ నిబంధనలు ఇలా ఉన్నాయి. :

చెత్తరహిత నగరాల సర్టిఫికేషన్ ప్రక్రియకోసం గతంలో పరిశీలించిన 25 అంశాలను/ సూచికలను 24కు తగ్గించారు. వాటిలో 1స్టార్, 3 స్టార్ స్థాయిలకోసం కేవలం 16 సూచికలు మాత్రమే తప్పనిసరైనవిగా నిర్దేశించారు. మిగిలిన 8 సూచికలను 5స్టార్, 7స్టార్ స్థాయిలకు అవసరమైనవిగా పేర్కొన్నారు.

జి.ఎఫ్.సి. నియమ నిబంధనల ప్రొటోకాల్ కోసం గతంలో అమలులో ఉన్న బహుళ దశల లెక్కింపు పద్ధతిని ప్రస్తుతం ఒకే దశకు తగ్గించారు. స్టార్ రేటింగ్.కోసం పట్టణ స్థానిక సంస్థలు దరఖాస్తుకోసం క్షేత్రస్థాయి పరిస్థితిని స్వయంగా సులభంగా మధింపు చేసుకోవడానికి ఇది దోహదపడుతుంది. ;

సవరించిన ప్రొటోకాల్ నియమ నిబంధనలను స్వచ్ఛ భారత్-అర్బన్ 2వ దశ ప్రాధాన్యతలతో ఏకీకృతం చేశారు. ఇంటింటినుంచి వ్యర్థాల సేకరణకు, వనరుల వర్గీకరణకు, వ్యర్థాల తొలగింపునకు, డంప్ సైట్ల నివారణకు మరింత ఎక్కువ స్థాయి వెయిటేజీ (50శాతం)ని కేటాయించారు;

సర్టిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడంతోపాటుగా, తదనంతర మధింపు ప్రక్రియలన్నింటినీ మరింత సరళతరం చేశారు. పూర్తిగా కాగితరహిత పద్ధతిలో డిజిటలీకరణ చేశారు; ఉదాహరణకు.. డిజిటల్ డిక్లరేషన్, వ్యర్థాల తొలగింపు సదుపాయాలను జియో ట్యాగింగ్ చేయడం, ప్రగతిని ఆమూలాగ్రం డిజిటల్ పద్ధతిలో పర్యవేక్షించడం తదితర చర్యలు తీసుకున్నారు;

సమాచార వ్యాప్తి, అవగాహనా కార్యక్రమం, సామర్థ్యాల నిర్మాణం, చెత్తనుంచి తయారైన ఉప ఉత్పాదనల అమ్మకం ద్వారా ఆదాయం, వంటి అంశాలను కూడా కొత్త ప్రొటోకాల్ నిబంధనల్లో చేర్చారు. వ్యర్థాల నిర్వహణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ఈ చర్య తీసుకున్నారు.

నగరాల ప్రణాళికా మధింపు ప్రక్రియ ఏడాది కాలం పూర్తిగా సాగేలా చూసేందుకు నిరంతర అంచనా ప్రక్రియను కూడా ప్రొటోకాల్ లో చేర్చారు.

కొత్త ప్రొటోకాల్ నిబంధనల టూల్ కిట్.ను ఆవిష్కరించిన సందర్భంగా కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రత్వ శాఖ కార్యదర్శి దుర్గాశంకర్ మిశ్రా మాట్లాడుతూ, విషయాలను సరళతరం చేయడం, సులగ్రాహ్యంగా చేయడం లక్ష్యంగా కొత్త టూల్ కిట్.ను రూపొందించినట్టు చెప్పారు. దేశంలోని నగరాలన్నీ పూర్తి సన్నాహాలతో రేటింగ్ ప్రక్రియలో పాలుపంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. టూల్ కిట్.ను సరళీకృతం చేయడంతో అన్ని నగరాలు కనీసం 3 స్టార్ రేటింగ్.ను అయినా సాధించేందుకు అవకాశం ఉంటుందని, ఎక్కువ నగరాలు మరింత పైస్థాయి రేటింగ్ కోసం ప్రయత్నించే అవకాశాలు కూడా ఉంటాయని ఆయన అన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, ఇందుకు సంబంధించిన ప్రజా చైతన్య, అవగాహనా కార్యక్రమాలను మరింత ఉధృతంచేయాలని నగర పరిపాలనా యంత్రాగాల ప్రతినిధులను, ప్రజా ప్రతినిధులను కోరారు. ప్రత్యేకించి స్థానిక భాషల్లో, మాండలికాల్లో అవగాహనా కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టాలన్నారు. నగరాలను స్వచ్ఛంగా, పరిశుభ్రంగా తయారు చేయాలన్న ప్రధానమంత్రి కలను సాకారం చేయడంతో భూముల విలువలు, పెట్టుబడులకు అవకాశాలు పెరగడంతో పాటు ప్రజలకు కూడా తాము నివసించే ఆవాసాలు గర్వకారణంగా మారుతాయన్నారు. ఎక్కువ రేటింగ్ పొందిన భారతీయ నగరాలు, ప్రపంచంలోని ఉత్తమ నగరాలతో పోల్చదగినవేనని మిశ్రా అన్నారు.

స్టార్ రేటింగ్ సర్టిఫికేషన్ ప్రక్రియను గురించి మిషన్ డైరెక్టర్ రూపా మిశ్రా వివరించారు. స్టార్ రేటింగ్ ప్రక్రియలో పురోగమన దిశగా కదలిక మొదలైందని, అయితే, చాలా వరకు పట్టణ స్థానిక సంస్థలు మరింత పురోగతి సాధించాల్సి ఉందని, కొత్త టూల్ కిట్ ఇందుకు దోహదపడుతుందని రూపా మిశ్రా చెప్పారు.

నగరాలను చెత్తరహితంగా తయారు చేసేందుకు స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ 2వ దశ కార్యక్రమం,..వందశాతం వ్యర్థాల తొలగింపుపై, చెత్త డంపింగ్ కేంద్రాల నిర్మూలనపై దృష్టిని కేంద్రీకరించింది. నిర్మాణ వ్యర్థాలు, కూల్చివేతతో పోగుబడే వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు వంటి వాటిని నివారించే ప్రక్రియపై కూడా ఈ కార్యక్రమంలోనే కింద దృష్టిని కేంద్రీకరించారు. ఏడాది పొడవునా మధింపు జరిగే ప్రక్రియకు ప్రాధాన్యం ఇచ్చిన కొత్త ప్రొటోకాల్ నిబంధనలతో నగరాలకు అవసరమైన మేర ప్రోత్సాహం లభిస్తుంది. తద్వారా, చెత్త రహిత నగరాలను ఏర్పాటుచేయాలన్న దార్శనికతను క్షేత్రస్థాయిలో నిజం చేయడానికి వీలుంటుంది.ఎప్పటికప్పుడు తాజా అంశాలను తెలుసుకునేందుకు స్వచ్ఛభారత్ పథకం అధికారిక వెబ్.సైట్.ను,.. వివిధ సామాజిక మాధ్యమ విభాగాలను సంప్రదించవచ్చు:

# 35 మంది ఐ ఆర్ ఎస్ (సి అండ్ ఐటి) అధికారుల 71వ బ్యాచ్ పాసింగ్ అవుట్ వేడుకకు అధ్యక్షత వహించిన సిబిఐసి చైర్మన్ శ్రీ వివేక్ జోహ్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 25:71వ బ్యాచ్ ఆఫ్ ఐఆర్ఎస్ (సి అండ్ ఐటి) ప్రొఫెషనల్ ట్రైనింగ్ ఫరీదాబాద్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, పరోక్ష పన్నులు మరియు నార్కోటిక్స్ (నాసిన్)లో ఈ రోజు పాసింగ్ అవుట్ పరేడ్ తో ముగిసింది.71వ బ్యాచ్ లో 35 మంది అధికారులు ఉన్నారు, వీరిలో 10 మంది మహిళా ఆఫీసర్లు ఉన్నారు. ఈ యువ అధికారులు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి పరోక్ష పన్నుల విధానంలో భారతదేశ అత్యంత ప్రసిద్ధ సంస్కరణ అయిన జి ఎస్ టి నిర్వహణకు నాయకత్వం వహిస్తారు.

కేంద్ర పరోక్ష పన్నులు ,కస్టమ్స్ (సిబిఐసి) ఛైర్మన్ శ్రీ వివేక్ జోహ్రి ఈ అధ్యక్షత వహించారు శిక్షణ పూర్తి చేసుకున్న అధికారుల కవాతు ను తిలకించి గౌరవ వందనం స్వీకరించారు.

శ్రీ జోహ్రి తన ముగింపు ప్రసంగంలో, ఇది శిక్షణ ముగింపు కావచ్చు కానీ ఖచ్చితంగా వారి అభ్యసన ముగింపు కాకూడదనే విషయాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని అధికారులను ఉద్బోధించారు.సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవాలని శ్రీ జోహ్రి అధికారులను ప్రోత్సహించారు రాబోయే సవాళ్లను ఎదుర్కోవటానికి సంస్థను ఒక దేటాతో నడిచేదిగా చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

శిక్షణను విజయవంతంగా పూర్తి చేసినందుకు 71వ బ్యాచ్ అధికారులను శ్రీ జోహ్రి అభినందించార. వారిని సంపూర్ణ వ్యక్తులుగా తీర్చి దిద్దడం లో అధికారుల కుటుంబాల సహకారాన్ని గుర్తిస్తున్నామని తెలిపారు.ఎన్.ఎ.సి.ఐ.ఎన్. డైరెక్టర్ జనరల్ శ్రీ హిమాన్షు గుప్తా స్వాగతపన్యాసం చేశారు. కష్ట పడి చేసే పనికి ప్రాముఖ్యతను , వృత్తి జీవితంలో మంచి పని నైతికత ను పాటించడం ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.

సభ్యుడు (అడ్మిన్), మౌంట్ సుంగితా శర్మ తన ప్రసంగంలో, కేటాయించిన లక్ష్యానికి ఉత్సాహంగా నిబద్ధులు కావాలని,దేశానికి సేవ చేయడానికి ప్రేరణ పొందాలని-రులను కోరారు.కోవిడ్-19 మహమ్మారిని ఎదుర్కోవడంలో ,అకాడమీలో శిక్షణకు కట్టుబడి ఉండటంలో బ్యాచ్ ప్రదర్శించిన అసాధారణ మైన దృఢత్వం ,ధైర్యాన్ని ఆమె ప్రశంసించారు.

పాసింగ్ అవుట్ వేడుకలో, శిక్షణ లో వివిధ రంగాలలో రాణించిన ఐదుగురు ఆఫీసర్ ట్రైనీలకు వారి అసాధారణ విజయాలకు పతకాలు లభించాయి. ఎస్.గజరాజ్ బచవత్ అత్యుత్తమ ఓవరాల్ పనితీరుకు ఆర్థిక మంత్రి బంగారు పతకాన్ని అందుకున్నారు.

# బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో వాజ్ పేయి జయంతి వేడుకలు

మణికొండ డిసెంబర్ 25: భారతీయ జనతాపార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షులు చిక్కిరి బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో భారతదేశ మాజీ ప్రధానమంత్రి భారతరత్న అటల్ బిహారి వాజ్ పేయి 97వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ అంజన్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు దుద్దాల లక్ష్మీనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కౌకుంట్ల ప్రభాకర్, నెల్లిపల్లి బుచ్చిరెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి జైపాల్ రెడ్డి, మున్సిపల్ మాజీ అధ్యక్షులు మండే నాగేష్, కౌన్సిలర్ ఆదిత్య రెడ్డి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శులు దాకురి నవీన్, జి.శివరాజ్, ఉపాధ్యక్షులు బండ మాది కిరణ్, దార్గుపల్లి శ్రీనివాస్, యువమోర్చా అధ్యక్షులు కావలి సురేందర్ ముదిరాజ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు పద్మ, నాయకులు బాలరాజ్, వాసు చారి, చెన్నయ్య, నరేష్ పాల్గొన్

# చిన్నారుల హరిత కృషి భేష్ - మంత్రి గంగుల

హైదరాబాద్, డిసెంబర్ 25:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన హరితహారం స్ఫూర్తితో .. పర్యావరణ పరిరక్షణకు మేము సైతం అంటూ హైదరాబాద్ నిజాం పేట కు చెందిన చిన్నారులు చేస్తున్న కృషిని మంత్రి గంగుల కమలాకర్ అభినందించారు?హైదరాబాద్ నిజాం పేట కు చెందిన చల్ల రాము బ్యాంక్ ఆఫ్ అమెరికాలో పని చేస్తున్నారు? వారి పిల్లలు దీశీత ( 11 ) సాహర్ష్ ( 7 ). తమ తల్లిదండ్రులు రాము, ప్రవీణ తెచ్చిన మామిడి పండ్లలోని పిక్కలు ,జీళ్ళు తీసి టిష్యూ పేపర్లు, కవర్లలో జాగ్రత్తపెడుతూ వచ్చారు? చిన్న చిన్న మొలకలు వచ్చిన తర్వాత వాటిని కప్పుల్లో, ప్లాస్టిక్ గ్లాసులు వేసి పెంచడం ప్రారంభించారు. వీరిద్దరూ దాదాపు 200 మామిడి పిక్కలను మొక్కలుగా మార్చారు.

# దేశముదుర్లు.. క్షణాల్లో నకిలీ ఆధార్ కార్డులు రెడీ

హైదరాబాద్, డిసెంబర్ 25: నకిలీ ఆధార్ ముఠా గుట్టు హైదరాబాద్ వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ రట్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ డీసీపీ రాధాకిషన్ రావుతో కలిసి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్ శుక్రవారం వివరాలు వెల్లడించారు.

బోరబండ, న్యూ అల్లాపూర్‌కు చెందిన నితేష్ సింగ్, టోలిచౌకీకి చెందిన సయ్యద్ ముస్తఫా, ఓల్డ్ హఫీజ్‌పేటకు చెందిన షేక్ జహంగీర్ పాషా, హైదర్‌గూడకు చెందిన మహ్మద్ అన్వరుద్దీన్ స్నేహితులు. గోల్నాక తులసీనగర్‌కు చెందిన రబ్బాని ఎంఏ, హకీంపేటకు చెందిన మహ్మద్ అజహర్ షరీఫ్ ఇద్దరూ ముస్తఫాకు చెందిన ఎస్ఎం ఎంటర్‌ప్రైజెస్‌లో పనిచేసేవారు. బోరబండ ఎస్ఆర్టీ నగర్‌కు చెందిన మహ్మద్ సోహైల్ నితేష్ సింగ్‌కు చెందిన జేబీ ఎంటర్‌ప్రైజెస్‌లో పని చేసేవారు.

లాక్‌డౌన్ తర్వాత ముస్తఫా వ్యాపారం దెబ్బతినడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో తన ఇబ్బందులను మిగిలిన స్నేహితులతో పంచుకున్నాడు. ఈ సందర్భంగా నితేష్ సింగ్ తనకు మధ్యప్రదేశ్ భోపాల్‌లో పవన్ అనే స్నేహితుడు ఉన్నాడని.. అతను అస్సాంలో ఆధార్ ఏజెన్సీలో పని చేస్తున్నట్లు తెలిపాడు. అతని వద్ద అస్సాంకు చెందిన ఆధార్ ఐడీ కార్డులు ఉన్నాయని, వాటిని విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పడంతో వారు వాటిని కొనుగోలు చేసి నగరంలో నకిలీవి సృష్టించి అవసరమైన అభ్యర్థులకు విక్రయించి సొమ్ము చేసుకోవాలని పథకం పన్నారు.

గత అక్టోబర్‌లో నితేష్ పవన్ నుంచి రూ.90 వేలకు ఆరు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీలను కొనుగోలు చేసి మిగిలిన వారికి విక్రయించాడు. దీంతో ఈ నలుగురు ఆధార్ కిట్స్, ల్యాప్‌టాప్, ఫింగర్ ప్రింట్ స్లాబ్, కెమెరాలను కొనుగోలు చేసి తమ ఆన్‌లైన్ సర్వీసెస్ కేంద్రాల్లో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సేవలు ప్రారంభించారు.

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఒక రాష్ట్రంలో జారీ చేసిన ఆధార్ కార్డులు ఆ రాష్ట్ర పరిధిలోనే వినియోగించాలి. అయితే నిందితులు హైదరాబాద్‌లో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ లేదా అప్‌డేషన్ కోసం అస్సాంకు కేటాయించిన కార్డులపై వివరాలను ముద్రించి నకిలీవి సృష్టించారు. ఇందుకోసం హైదరాబాద్, మేడ్చల్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ల పేరుతో నకిలీ స్టాంప్‌లను సృష్టించారు. ఆయా గెజిటెడ్ ఆఫీసర్ల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ బర్త్ సర్టిఫికెట్లను కూడా తయారు చేశారు. గత రెండు నెలలుగా ఆయా కేంద్రాల నుంచి సుమారు 3 వేల ఆధార్ కార్డులను జారీ చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

నకిలీ ఆధార్ కార్డుల భాగోతం యూఐడీఏఐ దృష్టికి వెళ్లడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో బంజారాహిల్స్, గోల్కొండ పీఎస్‌లలో కేసులు నమోదయ్యాయి. రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ బృందాలు నితేష్ సింగ్, ముస్తఫా, రబ్బాని, అజహర్ షరీఫ్, సోహైల్, జహంగీర్ పాషా, అన్వరుద్దీన్‌లతో పాటు మొరమ్మగడ్డకు చెందిన మహ్మద్ అహ్మద్‌లను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు భోపాల్‌కు చెందిన పవన్ పరారీలో ఉన్నాడు. వీరి నుంచి రూ.80 వేల నగదు, ఆరు ఆధార్ కిట్లు, 5 స్టాంప్‌లు, ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ దరఖాస్తులు, ఫోర్జరీ బర్త్ సర్టిఫికెట్లు, ఫేక్ ఆధార్ కార్డ్‌లను స్వాధీనం చేసుకున్నారు.

# మొత్తం బియ్యాన్ని కేంద్రం తీసుకోవాల్సిందే

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: తెలంగాణ ప్రభుత్వం సేకరించిన మొత్తం బియ్యాన్ని కేంద్రం తీసుకోవాల్సిందేనని మంత్రుల బృందం తేల్చిచెప్పింది. బియ్యం తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం నాటకాలు ఆడుతోందని, ఈ వ్యవహారాన్ని ఇంకా పొడిగిస్తే మంచిది కాదని హెచ్చరించింది. కేంద్రం రైతులను తీవ్రంగా అవమానించేలా వ్యవహరిస్తోందని మండిపడింది.

'రాష్ట్రం సేకరించిన మొత్తం బియ్యాన్ని తీసుకో కుంటే, మిగిలిన బియ్యాన్ని ఢిల్లీలోని ఇండియాగేట్ వద్ద పారబోసి నిరసన తెలుపుతాం'అని ఆర్‌అండ్‌బీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అల్టిమేటం ఇచ్చారు.

రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ఇంకా కొనసాగుతున్నాయని, ఇప్పటికే 60 లక్షల మెట్రిక్ టన్నుల పైబడి ధాన్యం సేకరించామని చెప్పారు. రైతుల సంక్షేమం దృష్ట్యా ఉన్నఫళంగా ధాన్యం సేకరణను ఆపేయలేమని, రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి పూర్తిగా కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.

శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో మంత్రులు గంగుల కమలాకర్, నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎంపీలు కేశవరావు, నామా నాగేశ్వరరావు, కేశవ్ సురేష్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, వెంకటేశ్ నేత, మన్నె శ్రీనివాసరెడ్డి, లింగయ్య యాదవ్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో సేకరించిన పూర్తి బియ్యాన్ని తీసుకుంటామని పార్లమెంట్ సాక్షిగా కేంద్రమంత్రి పీయూష్ గోయల్ మాట ఇచ్చారు. దానికి సంబంధించిన లేఖ రాని పక్షంలో 60 లక్షల మెట్రిక్ టన్నులకు మించి సేకరించిన బియ్యాన్ని ఢిల్లీకి తెచ్చి పారబోస్తాం. ధాన్యం సేకరణ అంశం రాష్ట్ర రైతులకు సంబంధించినది.. అందువల్ల కేంద్రప్రభుత్వం దీనిపై పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలి'అని పేర్కొన్నారు.

### బియ్యం తీసుకెళ్లకుండా నిందలా: గంగుల

60 లక్షల మెట్రిక్ టన్నులకు మించి సేకరించిన ధాన్యంపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత రాలేదని పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ చెప్పారు. యాసంగిలో బాయిల్డ్ రైస్ కొనబోమని కేంద్రం చెప్పినందున వచ్చే యాసంగిలో కొనుగోలు కేంద్రాలు ఉండబోవని స్పష్టం చేశారు. 'కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అబద్ధాలు చెబుతున్నారు. రాష్ట్రంలోని రైస్ మిల్లుల్లో సిద్ధంగా ఉన్న బియ్యాన్ని తీసుకెళ్లాలని ఎఫ్‌సీఐకి గతేడాది నుంచి ఇప్పటివరకు 7 లేఖలు రాశాం. వారికి బియ్యం తీసుకెళ్లే ఉద్దేశం లేదు. అందుకే మాపై నిందలు వేస్తున్నారు'అని పేర్కొన్నారు.

### 35 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్: నిరంజన్‌రెడ్డి

ఏటా రూ.90 వేల కోట్లు వెచ్చించి వంట నూనెలు దిగుమతి చేసుకుంటున్నామని చెబుతున్న కేంద్రం.. దేశ రైతులకు వంట నూనెలు పండించే దారి చూపించకపోవడం దౌర్భాగ్యమని వ్యవసాయ మంత్రి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. అందుకే వచ్చే వానాకాలంలో రాష్ట్రంలో 35 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రతినిధులు వచ్చి ఢిల్లీలో ఎదురుచూస్తున్నా పట్టించుకోకుండా కేంద్రం చిన్నచూపు చూస్తోందని అన్నారు. 2022 కల్లా దేశంలోని రైతుల ఆదాయం రెండింతలు చేస్తామన్న ప్రధాని మోదీ, రైతులు పండించిన పంటను ఇండియాగేట్ వద్ద పోసుకోవాల్సిన పరిస్థితికి తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, ధాన్యం సేకరణ అంశంలో పీయూష్ గోయల్‌కు రాష్ట్ర బీజేపీ నేతలు తప్పుడు సమాచారం ఇచ్చారని, తాము వాస్తవ పరిస్థితిని ఆయనకు వివరించామన్నారు. బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఇద్దరూ పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇది రాజకీయం కాదని.. రైతాంగ సమస్య అని వ్యాఖ్యానించారు. కాగా, గత శనివారం ఢిల్లీ వచ్చిన ఐదుగురు మంత్రులు, కేంద్రమంత్రి గోయల్ కార్యాలయం నుంచి లేఖ రాకపోవడంతో, తదుపరి కార్యాచరణ కోసం శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు పయనమయ్యారు.

# జనవరి 2 వరకు చండీగఢ్‌లో కళా కుంభ్-ఆజాదికా అమృత్ మహోత్సవ్‌ను జరుపుకోనున్న మోడరన్ ఆర్ట్ జాతీయ గాలరీ NGMA

న్యూఢిల్లీ, డిసెంబర్ 25:నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్, న్యూఢిల్లీ 25 డిసెంబర్ 2021 నుండి జనవరి 2, 2022 వరకు చండీగఢ్‌లో చిత్రకళాకృతుల కళా కుంభ్-ఆర్టిస్ట్ వర్క్ షాప్‌లతో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను జరుపుకుంటుంది. ఈ వేడుక భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గుర్తింపుకు నోచుకోని వీరుల పరాక్రమాల కథలను వెలికితీస్తుంది. ఇవి2022లో గణతంత్ర దినోత్సవ వేడుకల అంతర్భాగంగా ఉంటాయి, జాతీయ అభిమానం, శ్రేష్ఠతను వ్యక్తీకరించే సాధనంగా కళను విశ్లేషించే దిశగా చేసే ప్రయత్నమిది.

ఈ వేడుకలు చండీగఢ్‌లో 25 డిసెంబర్ 2021 నుండి 2 జనవరి 2022 వరకు నిర్వహిస్తారు. డెబ్బై-ఐదు మీటర్ల ఐదు స్క్రోల్స్ పెయింటింగ్ కోసం ఆర్టిస్ట్ వర్క్ షాప్‌లు జరుగుతాయి.

భారతదేశంలోని దేశీయ కళలను చిత్రీకరించే ఇతర ముఖ్యమైన వాటిని దేశంలోని ఇతర ప్రాంతాలలో కూడా ఇలాంటి వర్క్ షాప్‌లు నిర్వహిస్తారు. వీటిలో రూపొందే కళాకృతులు విభిన్న కళారూపాల ప్రతిబింబంగా ఉంటాయి, ఇవి సాంప్రదాయ, ఆధునికతల ప్రత్యేక సమ్మేళనాన్ని ఏర్పరుస్తాయి. భారత రాజ్యాంగంలోని సృజనాత్మక దృష్టాంతాల నుంచి సైతం ప్రేరణ పొంది నందలాల్ బోస్ అతని బృందం చిత్రించిన కళాత్మక అంశాలు విలక్షణమైన ఆకర్షణను కలిగి ఉన్నాయి. దేశంలోని వివిధ భౌగోళిక ప్రాంతాల నుంచి సుమారు 250 మంది కళాకారులు భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గుర్తింపుకు నోచుకోని వీరుల వీరోచిత జీవితాలను పోరాటాలను చిత్రీకరించి ప్రదర్శిస్తారు. నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ డైరెక్టర్ జనరల్‌తో పాటు ప్రముఖ సీనియర్ కళాకారులు ఈ కళాకారులకు మార్గదర్శకత్వం వహిస్తారు. ఎందరి సహకారంతోనో మొత్తం కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ఈ వర్క్ షాప్ కోసం నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్, న్యూ ఢిల్లీ చండీగఢ్‌లోని చిత్కారా విశ్వవిద్యాలయంతో కలిసి పనిచేస్తుంది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ అనేది 75 సంవత్సరాల ప్రగతిశీల భారతదేశ ప్రజల, సంస్కృతి, విజయాల అద్భుతమైన చరిత్రను స్మరించుకోవడానికి భారత ప్రభుత్వం చేస్తున్న ప్రశంసనీయ ప్రయత్నం . ఇది భారతదేశ సామాజిక-సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక గుర్తింపు గురించి ప్రగతిశీల స్వరూపం. ఇది ఔఉఓం డైరెక్టర్-జనరల్ శ్రీ అద్వైత్ గారనాయక్ కళాత్మక దృష్టి ప్రకారం పెద్ద ఎత్తున స్క్రోల్స్ పై ప్రాముఖ్యతను ఇవ్వడానికి ఉద్దేశించారు.

ఈ వర్క్ షాప్ చండీగఢ్, లడఖ్, జమ్మూ డ కాశ్మీర్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, హర్యానా, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ మొదలైన ప్రాంతాల నుండి వచ్చిన వీరుల శౌర్య గాథలను ప్రతిబింబిస్తుంది, దేశీయ కళారూపాలైన ఫాడ్, పిచ్వాయ్, మినియేచర్, కలంకారి, మందన వాల్లటో వంటి కొన్ని కళాత్మక వ్యక్తీకరణల సహాయంతో స్క్రోల్‌లు సమకాలీన వ్యక్తీకరణలను ప్రతిబింబిస్తాయి, ఇవి భారతదేశ మహోన్నత సాంస్కృతిక కళాత్మక వారసత్వ సారాంశాన్ని ప్రదర్శిస్తాయి, అదే సమయంలో మనకు పెద్దగా తెలియని వీరుల సంపూర్ణ త్యాగం సహకారాలు వెలుగులోకి వస్తాయి.

# ఉత్తరప్రదేశ్ లో ఆరోగ్యసదుపాయాలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహమిస్తున్న ఆయుష్ మంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ, డిసెంబర్ 25:ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఆరోగ్య సదుపాయాలను పెద్ద ఎత్తున ముందుకు తీసుకుపోవడానికి పలు కీలక చర్యలను ఆయుష్ మంత్రిత్వశాఖ ప్రకటించింది. నేషనల్ ఆయుష్ మిషన్ కింద వివిధ కార్యక్రమాలు చేపట్టేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి భారత ప్రభుత్వం మొత్తం 553.36 కోట్ల రూపాయలను విడుదల చేయడం జరిగింది. ఈ ప్రధాన ప్రకటనలను కేంద్ర ఆయుష్ ,పోర్టులు, షిప్పింగ్ , వాటర్ వేస్ శాఖ మంత్రి శ్రీ శర్వానంద్ సోనోవాల్ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సమక్షంలో ప్రకటించారు.

సుస్థిర, సమర్థమైన,అందుబాటు ధరలో దేశంలో ఆరోగ్య సదుపాయాలు అందుబాటులోకి తెచ్చే కృషిలో భాగంగా 50 పడకల 8 కొత్త సమీకృత ఆయుష్ ఆస్పత్రులను ప్రారంభించడం జరిగింది. వీటిని దియోరియా, కౌశాంబి, సోన్‌భద్ర, లక్నో, కాన్పూర్, సంత్ కబీర్ నగర్, కాన్పూర్ దేహ్‌మత్, లలిత్‌పూర్‌లలో ఏర్పాటు చేశారు. వీటిని 72 కోట్ల రూపాయల వ్యయంతో నెలకొల్పారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో 500 కొత్త ఆయుష్ హెల్త్, వెల్‌నెస్ కేంద్రాలు (హెచ్.డబ్ల్యు.సిలు) ఏర్పాటయ్యాయి.

ప్రజలకు బలమైన ఆరోగ్య సంరక్షణ సదుపాయం పునాది ఏర్పరచడంతో, 49.83 కోట్ల రూపాయల పెట్టుబడితో నూతన ఆయుష్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఆయుర్వేద కు కేంద్రమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కొత్త ఆయుర్వేద ఇన్‌స్టిట్యూట్ అయోధ్యలో ఏర్పాటు కానుంది. దీనికి తోడు, కొత్తగా ఆరు 50 పడకల ఆస్పత్రులకు శంకుస్థాపన చేయడం జరిగింది. ఇవి ఉన్నావ్, షారావస్తి, హర్దోయ్, గోరఖ్‌పూర్, సంబల్, మిర్జాపూర్ లలో ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం 78 కోట్ల రూపాయలు. ఉత్తరప్రదేశ్ లోని వివిధ జిల్లాలలో 250 కొత్త ఆయుష్ ఆస్పత్రులను నిర్మించనున్నారు.

రాష్ట్రంలో బలమైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించి ఆయుష్ పాత్రను ప్రస్తావిస్తూ శ్రీ సోనోవాల్, 50 పడకల ఆయుష్ ఆస్పత్రులు రాష్ట్రంలో నిర్మాణం తో ప్రజలు ఆయుష్ వైద్యం ద్వారా సంపూర్ణ ఆరోగ్య సేవలు పొందగలుగుతారని అన్నారు. ఆయుష్ హెల్త్, వెల్‌నెస్ సెంటర్ లను ప్రధానంగా ప్రాథమిక స్థాయిలో నిర్మించడం జరిగిందని, ప్రజల సంపూర్ణ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వీటిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయుష్ సూత్రాలు, విధానాల ఆధారంగా వీటిని ఏర్పాటు చేశామన్నారు. వీటితో ప్రజలు ఆరోగ్యకరమైన జీవనాన్ని అనుసరించడానికి వీలు కలుగుతుందని అన్నారు.

ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ, ఆయుష్ మంత్రిత్వశాఖ తీసుకున్న చర్యలు సామాన్య ప్రజలకు ఎంతగానో ఉపయోగపడనున్నాయన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకమైన నేషనల్ ఆయుష్ మిషన్ ను ఆయుష్ మంత్రిత్వశాఖ 2014 నుంచి అమలు చేస్తున్నది. ఆయుష్ ఆస్పత్రులు, డిస్పెన్సరీల స్థాయి పెంపు ద్వారా ఆయుష్ సేవలను సార్వత్రికంగా అందుబాటులోకి తీసుకురావడం దీని ఉద్దేశం. దీనికితోడు సంస్థాగత సామర్థ్యాన్ని రాష్ట్రస్థాయిలో బలోపేతం చేయడం, ఆయుష్ విద్యాసంస్థలను బలోపేతం చేయడం, 20,30,50 పడకల ఆయుష్ సమీకృత ఆస్పత్రుల ఏర్పాటు ఈ మిషన్ లో ప్రధానమైనవి.

కేంద్ర కేబినెట్2023-24 వరకు జాతీయ ఆయుష్ మిషన్ కింద ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా 12,500 ఆయుష్ ,హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను అమలులోకి తెచ్చేందుకు కేంద్రకేబినెట్ ఆమోదం తెలిపింది. ఆయుష్ సూత్రాల ఆధారంగా సంపూరర్ణ ఆరోగ్య నమూనాతో కూడిన సేవలను అందించడం దీని లక్ష్యం. ఇది వ్యాధుల భారాన్ని తగ్గించి ,ప్రజల స్వీయ రక్షణకు వారికి సాధికారత కల్పిస్తుంది. ప్రస్తుతం జాతీయ ఆయుష్ మిషన్ అమలు రెండో దశలో ఉంది. ఇది 2025-26 వరకు కొనసాగుతుంది. ఇది ఆయుష్ పబ్లిక్ హెల్త్ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ప్రతిపాదించిది. ఇందులో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను భాగస్వాములను చేయడం జరిగింది.

# స్థానిక సెంట్రల్ జి.ఎస్.టి. అధికారుల సహకారంతో కాన్పూర్‌లో సోదాలు ప్రారంభిన - డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జి.ఎస్.టి. ఇంటెలిజెన్స్ (డి.జి.జి.ఐ), అహ్మదాబాద్ అధికారుల

న్యూఢిల్లీ, డిసెంబర్ 25:నిర్దిష్ట నిఘా సమాచారం మేరకు, స్థానిక సెంట్రల్ జి.ఎస్.టి. అధికారుల సహకారంతో, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జి.ఎస్.టి. ఇంటెలిజెన్స్ (డి.జి.జి.ఐ), అహ్మదాబాద్ అధికారులు 22.12.2021 తేదీన కాన్పూర్‌లో సోదాలు ప్రారంభించారు. శిఖర్ బ్రాండ్ పాన్ మసాలా మరియు పొగాకు ఉత్పత్తుల తయారీదారులైన కాన్పూర్ లోని లు త్రిమూర్తి ఫ్రాగ్రెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో పాటు, ఆ ఉత్పత్తుల రవాణా కార్యకలాపాలు నిర్వహిస్తున్న కాన్పూర్, ట్రాన్స్‌పోర్ట్ నగర్ లోని గణపతి రోడ్ క్యారియర్స్ సంస్థ కార్యాలయం / గోడౌన్లలో ఈ సోదాలు జరిగాయి.

చట్ట నిబంధనల ప్రకారం చెల్లించవలసిన పన్ను చెల్లించకుండా తయారీదారులు తమ ఉత్పత్తులను రహస్యంగా సరఫరా చేస్తున్నట్లు అధికారులు సమాచారం అందుకున్నారు. సరకులను తరలించే సమయంలో ఇ-వే బిల్లులు తయారు చేయకుండా నివారించడానికి, ఒక పూర్తి ట్రక్కు నిండా సరుకు రవాణా చేస్తూ, వాటి విలువ 50,000 రూపాయల కంటే తక్కువగా ఉన్నట్లు ప్రకటిస్తూ, ఉనికిలో లేని సంస్థల పేరుతో రవాణా సంస్థ తరచుగా అనేక ఇన్వాయిస్ లు రూపొందించినట్లు సమాచారం వచ్చింది. దీనికి తోడు, ఆ రవాణా సంస్థ అటువంటి రహస్య సరఫరా ద్వారా లభించే ఆదాయాన్ని నగదు రూపంలో సేకరించి, తమ కమిషన్ మినహాయించుకుని, ఆ తర్వాత, ఆ మొత్తాన్ని తయారీ సంస్థ కు అందజేయడం జరుగుతోంది.

ఇన్వాయిస్ లు మరియు ఈ-వే బిల్లులు లేకుండా ఫ్యాక్టరీ నుండి బయటకు వచ్చిన అటువంటి 4 ట్రక్కులను, అధికారులు ముందుగా ఫ్యాక్టరీ ప్రాంగణం వెలుపల, విజయవంతంగా అడ్డగించి, స్వాధీనం చేసుకుని, తమకు అందిన నిఘా సమాచారాన్ని ధృవీకరించారు.

ఫ్యాక్టరీ ఆవరణలో, భౌతికంగా ఉన్న సరకుల వివరాలను పరీక్షించిన సమయంలో, ముడి పదార్థాలు, పూర్తయిన ఉత్పత్తులు తక్కువగా ఉన్నట్టు తేలడంతో, పూర్తయిన ఉత్పత్తులను రహస్యంగా తరలించినట్లు గుర్తించడం జరిగింది. జి.ఎస్.టి. చెల్లించకుండా వస్తువులు తరలించినట్టు, కంపెనీ తరఫున అధీకృత సంతకం చేసే వ్యక్తి అంగీకరించారు.

జి.ఎస్.టి. చెల్లించకుండా వస్తువుల రవాణా కోసం గతంలో ఉపయోగించిన 200 కంటే ఎక్కువ నకిలీ ఇన్వాయిస్ లను కూడా రవాణా సంస్థ, గణపతి రోడ్ క్యారియర్స్ ప్రాంగణం నుండి స్వాధీనం చేసుకోవడం జరిగింది. నకిలీ ఇన్వాయిస్ ల ముసుగులో ఈ-వే బిల్లులు లేకుండా సరుకులు రవాణా చేసి, అమ్మకం ద్వారా వచ్చిన మొత్తాన్ని ఉత్పత్తిదారునికి అందజేయడానికి నగదు రూపంలో సేకరించినట్లు, రవాణా సంస్థ అంగీకరించింది. రవాణా సంస్థ నుండి 1.01 కోట్ల రూపాయల నగదు స్వాధీనం చేసుకోవడం జరిగింది. నిఘా వర్గాలకు అందిన సమాచారం ఆధారంగా, ఈ కంపెనీ కి ఎక్కువగా నగదు రూపంలో పెర్ఫ్యూమరీ కాంపౌండ్ లను సరఫరా చేస్తున్న, కాన్పూర్, ఆనంద్ పురి లోని 143 లో ఉన్న కన్నౌజ్, ఉత్తరప్రదేశ్ కు చెందిన ఓడోచెమ్ ఇండస్ట్రీస్ సంస్థ భాగస్వాముల నివాస ప్రాంగణాల్లో సోదాలు చేయడం జరిగింది. అమ్మకాల ద్వారా వచ్చిన నగదును ఆ ప్రాంగణంలో రహస్యంగా ఉంచినట్లు అనుమానించడం జరిగింది. వారి నివాస ప్రాంగణంలో సోదాలు నిర్వహిస్తున్న సమయంలో భారీ మొత్తంలో కాగితాల్లో చుట్టిన నగదు బయటపడింది. కాన్పూర్ లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారుల సహాయంతో ప్రారంభించిన నగదు లెక్కింపు ప్రక్రియ 24.12.2021 తేదీ సాయంత్రం వరకు కొనసాగే అవకాశం ఉంది. మొత్తం నగదు 150 కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా. తదుపరి విచారణలు పెండింగ్ లో ఉన్న సమయంలో, సి.జి.ఎస్.టి. చట్టంలోని సెక్షన్-67 నిబంధనల ప్రకారం, నగదును స్వాధీనం చేసుకోవాలని సంబంధిత అధికారులు ప్రతిపాదించారు.పన్ను బకాయిల కింద ఇప్పటివరకు 3.09 కోట్ల రూపాయలు రాబట్టడం జరిగింది. సున్నితమైన ఈ విచారణలో అవసరమైన తదుపరి చర్యలు కొనసాగుతున్నాయి.






# వాజ్‌పేయి జయంతి సందర్భంగా.. "మైక్రో డొనేషన్" కార్యక్రమాన్ని లాంచ్ చేసిన బీజేపీ..

మీరు అందించే చిన్న మొత్తాలే.. రేపటి దేశ భవిష్యత్తుకు పెద్ద బలాన్ని అందిస్తాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జయప్రకాశ్ నడ్డా (జేపీ నడ్డా) అన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ (బీజేపి) ఓ సరికొత్త ప్రోగ్రామ్‌ని లాంచ్ చేసింది. "భారతదేశాన్ని నిరంతరం ఫస్ట్ ప్లేస్‌లో ఉంచేందుకు కృషి చేస్తున్న పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రత్యేక సూక్ష్మ విరాళాల కార్యక్రమాన్ని ప్రారంభించాం" అని పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా శనివారం తెలిపారు.

ట్విటర్‌లో నడ్డా ఇలా అన్నారు, "ఈ రోజు డిసెంబర్ 25, అటల్ జీ జన్మదినం నుంచి ఫిబ్రవరి 11 వరకు అంటే దీన్ దయాళ్ జీ పుణ్య తిథి వరకు, బీజేపీ ప్రత్యేక సూక్ష్మ విరాళాల కార్యక్రమం జరగనుంది. దీనికి మీ మద్దతు అందించడం ద్వారా పార్టీ మరింత బలోపేతం అవుతుంది. దీంతో దేశాన్ని ఎల్లప్పుడూ బెస్ట్ గా ఉంచడంలో బీజేపీ కృషి చేస్తుంది" అన్నారు.

పార్టీ సూక్ష్మ విరాళాల కార్యక్రమానికి తనవంతుగా సహకారాన్ని అందిస్తూ.. నడ్డా ఇలా అన్నారు, "జెజీఎనీ యాప్ ద్వారా 'డొనేషన్' మాడ్యూల్‌ని ఉపయోగించి ఏఖిని బలోపేతం చేయడానికి నా సొంత ఫండ్స్‌ని అందించాను. రిఫరల్ కోడ్‌ని ఉపయోగించి మీరు కూడా ద

# ఘనంగా అటల్ బిహారి వాజపేయి జన్మదిన వేడుకలు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 25(నేటినిజం ప్రతినిధి):భారత రత్న , మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి97 జయంతి సందర్భంగా శనివారం వేములవాడ పట్టణ బీజేపీ కార్యాలయంలో నాయకులు , కార్యకర్తల ఘనంగా నిర్వహించారు అటల్ బిహారీ వాజపేయి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు . వాజ్ పయ్ జయంతి సందర్భంగా సుపరిపాలన దినోత్సవం పురస్కరించుకొని బిజెపి జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు బల్కమ్ లక్ష్మీ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మహిళా ప్రజాప్రతినిధులు అయినా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ముప్పిడి సునంద,24 వ వార్డు కౌన్సిలర్ అన్నారం ఉమ,భర్తల్ పెల్లి ఎంపిటిసి చింతకింద అనసూర్య ,రాజన్నపేట ఎంపీటీసీ ధరావత్ రజిత, బిజెపి రాష్ట్ర మహిళా కార్యవర్గ సభ్యురాలు ద్వారక శ్రీదేవి, బీజేపీ పార్టీ బోయినపల్లి మహిళా అధ్యక్షురాలు మెరుపుల సంగీత,ప్రధాన కార్యదర్శిసంతోషిని ,ఉపాధ్యక్షురాలు రేణుక ,పట్టణ అధ్యక్షురాలు రాధిక లును ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్పేయి ఈ దేశానికి ఎంతో సేవ చేశారు వారి హయాంలో గ్రామీణ సడక్ యోజన పథకం ప్రతి గ్రామానికి రహదారి నిర్మాణం జరిగే విధంగా ఆయన చొరవ తీసుకున్నారని ,అలాగే కార్గిల్ యుద్ధం లో భారత దేశాన్ని విజయ పథంలో నడిపించి భారతదేశానికి విజయాన్ని అందించాడు వంటి నాయకుడిని అని అన్నారు .కౌన్సిలర్ ,పట్టణ బిజెపి అధ్యక్షులు, సంతోష్ బాబు,నాయకుడు నవీన్ యాదవ్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# వేములవాడ ముస్లిం కమిటీ అధ్యక్షులు , ఉపాధ్యక్షులకు ఘనంగా సన్మానించిన సిరిసిల్ల ముస్లిం సోదరులు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 25(నేటినిజం ప్రతినిధి): నూతనంగా ఎన్నికైన వేములవాడ ముస్లిం కమిటీ అధ్యక్షులు మహమ్మద్ అక్రమ్ , ఉపాధ్యక్షులు రసూల్ ను శనివారం సిరిసిల్ల కమిటీ మాజీ అధ్యక్షులు ముస్తఫా , ముస్లిం నాయకులు ఖాజా , ఇంతియాజ్ , మన్సూర్ , ఫెరోజ్ , అజాహార్ , అషిఫ్ , తాజా , జాకీర్ లు వారిని పూలమాలలు వేసి శాలువా కప్పి ఘనంగాసన్మానించారు .ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మహమ్మద్ అక్ర మ్,సయ్యద్ రసూల్ మాట్లాడుతూ ముస్లిం సంక్షేమానికి కోసం పాటు పడతానని ప్రతి ఒక్కరి సలహా సూచనలతోనే ముందుకు సాగుతుందని తమ కమిటీ అని అన్నారు. తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు .తమను సన్మానించిన సిరిసిల్ల ముస్లిమ్ కమిటీ మాజీ అధ్యక్షులు ముస్తఫా అలాగే యూత్ నాయకులకు ధన్య వాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లో ముస్లిం కమిటీ మాజీ అధ్యక్షులు అంజద్ పాషా , మహమ్మదీయ మజీద్ అధ్యక్షులు షేఖ్ మహమ్మద్ , షేక్ షరీఫ్ , ఇఫ్టికార్ హుస్సేన్ , ఖాజా అలి , ఇంతియాస్ , షాహిద్ , నవాబు ముస్లిం నాయకులు పాల్గొన్నారు .

# గత 225 రోజుల నుండి మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమం

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 25(నేటి నిజం ప్రతినిధి):మైవేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చేపడుతున్న నిత్యాన్నదాన కార్యక్రమం శనివారం నాటికి ×225× రోజులకు చేరుకుంది. దాతల సహకారంతో నిత్యాన్నదాన కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. శనివారం అన్నదాన కార్యక్రమం లక్ష్మీ గణపతి కాంప్లెక్స్ ముందు, పార్కింగ్ స్థలంలో, భీమేశ్వరాలయం ముందు ఉన్న యాచకులకు , అన్నార్థులకు మొత్తం70 మందికి అన్నదానము చేయడం జరిగింది. ఇట్టి అన్నదాన కార్యక్రమం ×225× రోజులుగా దాతల సహకారంతో నిరంతరాయంగా నిర్వహించడం జరుగుతుందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. నిత్యాన్నదానం చేస్తున్న క్రమంలో శనివారం అన్నదాతలుగా నగుబోతు రవీందర్, రొక్కం నర్సింహా రెడ్డి,లక్కాకుల రవి-శిరీష దంపతులు, లెక్కల రమాదేవి-బస్వయ్య గార్లు మరియూ కుటుంబ సభ్యులు× అందించిన విరాళాలతో నేటి అన్నదానం నిర్వహించడం జరిగింది. అన్నదాత సుఖీభవ. అన్నదానానికి విరాళాలు అందించిన ప్రతీఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. దాతలుచేస్తున్న సహకారంతో నిత్య అన్నదాన కార్యక్రమం లక్ష్యంతో ముందుకు సాగడం జరుగుతుందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, నాగుల చంద్రశేఖర్, జూలపెల్లి రాజు, ప్రతాప నటరాజు, కొప్పుల హనుమాన్, పొలాస రాజేందర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు సిద్దంశెట్టి రాజేశం, చల్లా సత్తయ్య, ముంజ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయినా క్రీడాకారునికి ఆర్థిక సహాయం చేయాలని దాతలకు విజ్ఞప్తి

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 25(నేటినిజం ప్రతినిధి):రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన దొంతుల అచ్యుత్ జాతీయ స్థాయి ఫూట్ బాల్ పోటీలకు ఎంపిక అయిన ఆ క్రీడకారునికి ఆది లొనే ఆర్థిక ఇబ్బందులతొ దాతల సహాయం కొరకు ఎదురుచూస్తున్నాడు అచ్యుత్ హైదరాబాద్ లో బీటెక్ మూడవ చదువుతూ పాటు క్రీడల్లో తన ప్రతిభ ను చూపుతూ గ్రామీణ స్థాయి నుండి జేఎన్ టీయూ సౌత్ జోన్ పరిధి లో ఎంపికయ్యాడు అనిజిల్లా యువజన సంఘాలు అధ్యక్షుడు సోమినేని బాలు ఒక పత్రిక ప్రకటన ద్వారా తెలపడం ఆయనది కేరళ రాష్ట్రములోని కొట్టాయం జిల్లా లో జనవరి 3 నుండి 8 వరకు సౌత్ ఇండియా లెవల్ ఫూట్ బాల్ పోటీలు జరుగుతున్న సమయములో జేఎన్ టీయూ వారు నిర్వహించే పోటీలకు వెళ్ళడానికి క్రీడాకారులు వారి స్వంత ఖర్చులతో వెళ్ళాలని సర్కులర్ జారిచేయడం జరిగింది ఈ పేద క్రీడకారునికి దాతలు ముందుకు వచ్చి జాతీయ స్థాయి పోటీలకు వెళ్ళడానికి ఆర్థిక సహాయము అందించాలని సోమినేని బాలు కోరుచున్నారు ఈ నెంబర్ కు కు ఫోన్ పే చేయగలరని8008379351 దాతలను వేడుకుంటున్నాం

# సిద్దిపేట జిల్లాలో విషాదం

సిద్దిపేట: జిల్లాలోని కొండపాక మండలం సిరిసనగండ్లలో విషాదం జరిగింది. ఏడాదిన్నర కొడుకుపై కిరోసిన్ పోసి నిప్పంటించింది. అనంతరం తల్లి ఆత్మహత్య చేసుకుంది. మృతులను తల్లి నవిత, కుమారుడు మణిదీప్‌గా గుర్తించారు. ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమని స్థానికులు చెబుతున్నారు.

# సీజేఐ ఎన్వీ రమణకు ఏపీ ప్రభుత్వం తేనీటి విందు

విజయవాడ, డిసెంబర్ 25:: ఏపీ పర్యటనలో ఉన్న సీజేఐ ఎన్వీ రమణకు ప్రభుత్వం తేనీటి విందు ఇచ్చింది. ఇందిరాగాంధీ స్టేడియంలో సీజేఐకు ఇచ్చిన తేనీటీ విందులో రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఏపీ ప్రభుత్వం ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి హాజరైన సీజేఐ ఎన్వీ రమణకు సీఎం వైఎస్ జగన్ దంపతులు స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంలు, మంత్రులు పాల్గొన్నారు. ఈ తేనీటి విందుకు హాజరైన వారిలో పలువురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో పాటు ఏపీ, తెలంగాణ చీఫ్ జస్టిస్‌లు, రెండు రాష్ట్రాల న్యాయమూర్తులు ఉన్నారు. అంతకుముందు నోవాటెల్ హోటల్‌లో సీజేఐ ఎన్వీ రమణకు సీఎం వైఎస్ జగన్ మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ జిల్లాలో మూడు రోజుల పర్యటన ముగించుకున్న తర్వాత నేరుగా విజయవాడ చేరుకున్న సీఎం జగన్.. నోవాటెల్ హోటల్‌లో సీజేఐని కలిసి తేనీటి విందుకు ఆహ్వానించారు.

# వర్క్ వీసాల జారీలో అమెరికా కీలక నిర్ణయం!

వాషింగ్టన్, డిసెంబరు 25: వర్క్ వీసాల జారీలో అగ్రరాజ్యం అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. హెచ్1బీ సహా పలు రకాల వీసాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వ్యక్తిగత ఇంటర్వ్యూల నుంచి తాత్కాలికంగా మినహాయింపు ఇచ్చింది. ఒమైక్రాన్ వేరియంట్ కారణంగా కరోనా వైరస్ ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో వ్యక్తిగత ఇంటర్వ్యూలను రద్దు చేస్తున్నట్టు అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది. హెచ్-1బీ, హెచ్-3, హెచ్-4, ఎల్-1, ఓ, పీ, క్యూ వీసాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ అవకాశం ఇస్తున్నట్టు తెలిపింది. కొవిడ్ వైరస్ మళ్లీ ప్రబలుతున్న నేపథ్యంలో 2022 డిసెంబరు 31 వరకు వ్యక్తిగత ఇంటర్వ్యూలను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు వెల్లడించింది.

అయితే దీనిపై తుది నిర్ణయం కాన్సుల్ అధికారులదేనని స్పష్టం చేసింది. స్థానిక పరిస్థితులను అనుసరించి అవసరమైతే వ్యక్తిగత ఇంటర్వ్యూలు పెట్టే అధికారం ఎంబసీ, కాన్సులేట్లకు కల్పిస్తున్నట్టు వివరించింది. ఎప్పటికప్పుడు దరఖాస్తుదారులు సంబంధిత ఎంబసీ/కాన్సులేట్ల వెబ్‌సైట్లను అనుసరిస్తుండాలని సూచించింది.

రెండు డోసులు తీసుకున్న భారతీయులు సహా అంతర్జాతీయ ప్రయాణికులు అందరిపైనా ఆంక్షలను గత నెల 8న అమెరికా ఎత్తివేసింది.

కరోనా నెగిటివ్ సర్టిఫికెట్ ఉన్న వారిని తమ దేశంలోకి అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

# మర్యాద పూర్వకంగా గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్సీలు

అమరావతి, డిసెంబర్ 25:నూతనంగా ఎమ్మెల్సీలుగా బాధ్యతలు తీసుకున్న తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిసారు.

రాజ్ భవన్ వేదికగా జరిగిన ఈ భేటీలో గవర్నర్ వీరితో ముచ్చటించారు. ప్రజా సేవే పరమావధిగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

శాసన వ్యవస్థలో క్రియాశీలక పాత్ర పోషించే శాసన పరిషత్తుకు వన్నె తీసుకురావాలని, అర్థవంతమైన చర్యలతో ప్రజా సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని గవర్నర్ సూచించారు.

ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్తగా కూడా వ్యవహరిస్తున్న తలశిల రఘురామ్ ప్రభుత్వం అమలు చేస్తున్న విభిన్న సంక్షేమ కార్యక్రమాలను గురించి గవర్నర్‌కు వివరించారు.

అలాగే పార్టీ కార్యాలయ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న లేళ్ల అప్పిరెడ్డి ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా రెడ్ క్రాస్ నేతృత్వంలో నిర్వహించిన రక్తదాన శిబిరాలు, ఇతర సేవ కార్యక్రమాల గురించి గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని రఘురామ్, అప్పిరెడ్డి గౌరవ గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# 'ఒమిక్రాన్' కి ఆనందయ్య మందు .. యూకే, యూఎస్ ఏకి పంపిణి

అమరావతి, డిసెంబర్ 25:ప్రపంచమంతటా కరోనాతో పాటు ఒమిక్రాన్ కూడా వ్యాపిస్తుంది. ఈనేపథ్యంలో ఆయుర్వేద నిపుణుడు ఆనందయ్య పేరు మరోసారి తెరపైకి వచ్చింది. ఒమిక్రాన్ కి కూడా తాను మందును తయారు చేశానని తెలిపారు. అంతేకాదు ఈ మందు పంపిణీ కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ మందును ఏడాది పాటు నిల్వ ఉంచుకోవచ్చని అన్నారు. మందు తీసుకునే వారు 15 రోజుల పాటు మాంసాహారం, మద్యం తీసుకోకూడదని చెప్పారు. అయితే ఈ మందుని బూస్టర్ డోస్ మాదిరిగా ఒమిక్రాన్ సోకకముందే వేసుకోవాలని చెప్పారు. 22రకాల దినుసులతో , ఐదు రకాల మందులు తయారు చేసినట్టు వెల్లడించారు ఆనందయ్య. ఈ మందును ఒకే రోజు రెండు పూటలా తీసుకుంటే సరిపోతుందన్నారు. తన మందుల తయారీకి కోర్టుల అనుమతి కూడా ఉందని అన్నారు. ప్రస్తుతం ఈ మందును బంధువులు, మిత్రుల ద్వారా ఒమిక్రాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న యూకే, యూఎస్ఏ తదితర దేశాలకు ఎక్కువగా పంపిస్తున్నామని వివరించారు.

# చైనాలోని జియాన్‌లో లాక్‌డౌన్.. రెండు రోజులకు ఒకసారే బయటకు!

బీజింగ్, డిసెంబర్ 25:: కరోనా వైరస్ కట్టడిలో చైనాలో ఎంత అప్రమత్తంగా ఉంటుందో చెప్పేందుకు ఇది చక్కని ఉదాహరణ. షాంగ్సీ వాయవ్య ప్రావిన్స్‌లోని జియాన్ నగరంలో కేసుల అమాంతం పెరగడంతో అప్రమత్తమైన అధికారులు గురువారం జియాన్‌లో కఠిన ఆంక్షలు విధించారు. క్రిస్మస్ రోజైన శనివారం ఇక్కడ 75 కేసులు వెలుగుచూశాయి. ఈ ఏడాది ఒక్క రోజులో ఇన్ని కేసులు వెలుగు చూడడం ఇదే తొలిసారి. ఇక, దేశంలో నేడు 140 కేసులు వెలుగుచూడగా అందులో 87 స్థానికంగా సంక్రమించినట్టు జాతీయ ఆరోగ్య కమిషన్ తెలిపింది. అంతకుముందు రోజు వీటి సంఖ్య 55గా ఉండడం గమనార్హం.

కేసుల సంఖ్య మళ్లీ పెరగడంతో అప్రమత్తమైన అధికారులు జియాన్‌లో కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. గురువారం నుంచి నగరంలోని 13 మిలియన్ల మంది లాక్‌డౌన్‌లోనే గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు కూడా జనం అవస్థలు పడుతున్నారు. రెండు రోజులకోసారి ఒక కుటుంబం నుంచి ఒక్కరిని మాత్రమే సరుకులు తెచ్చుకునేందుకు బయటకు అనుమతిస్తున్నారు. ఒకవేళ నగరం విడిచి వెళ్లాలంటే మాత్రం అధికారుల అనుమతి తప్పనిసరి. జియాన్‌లో ఈ ఏడాది డిసెంబరు 9న తొలి కరోనా కేసు నమోదైంది. ప్రస్తుతం అక్కడ 330 కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ స్థానికంగా వ్యాప్తి చెందినవేనని అధికారులు తెలిపారు.

మరోవైపు, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వింటర్ ఒలింపిక్స్‌కు బీజింగ్ ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో పెరుగుతున్న కేసులకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యల ప్రారంభించింది. 2019లో చైనాలో కరోనా తొలి కేసు నమోదైన తర్వాత అక్కడ ఇప్పటి వరకు 1,00,871 కేసులు నమోదయ్యాయి. 5 వేల కంటే తక్కువగా మరణాలు నమోదయ్యాయి.





# విండీస్‌తో టీ20 సిరీస్‌కు ఇంగ్లండ్ రెడీ.. జనవరి 22 నుంచి మ్యాచ్‌లు..




న్యూఢిల్లీ, డిసెంబర్ 25:వెస్టిండీస్‌తో జనవరిలో జరగనున్న టీ20 సిరీస్‌కు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ఇంగ్లండ్ జట్టును ప్రకటించింది. 16మంది సభ్యుల జట్టులో ఇద్దరు కొత్తవారికి అవకాశం లభించింది. పేసర్ డేవిడ్ పైన్, జార్జ్ గార్టన్‌లకు చోటు దక్కింది. విండీస్ పర్యటనలో వీరు ఇంగ్లండ్ తరఫున అరంగేట్రం చేయనున్నారు. ఈ సిరీస్‌కు తాత్కాలికి హెడ్‌కోచ్‌గా కోలింగ్‌వుడ్ వ్యవహరించనున్నాడు. ఈ సందర్భంగా కోలింగ్‌వుడ్ మాట్లాడుతూ వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరగనున్న టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్ని సమతుల్యం చేస్తూ ఆటగాళ్లను ఎంపిక చేసినట్లు తెలిపాడు.

ఇంగ్లండ్-వెస్టిండీస్ మధ్య జరిగే 5మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్ జనవరి 22, రెండోమ్యాచ్ జనవరి 23, మూడో మ్యాచ్ జనవరి 26, నాలుగో మ్యాచ్ జనవరి 26, ఐదో మ్యాచ్ జనవరి 30న జరగనుంది. ఇంగ్లండ్ టీ20జట్టు: ఇయాన్ మోర్గాన్ (కెప్టెన్), మొయిన్‌అలీ, టామ్‌బాంటన్, సామ్‌బిల్లింగ్స్, లియామ్ డాసన్, జార్జ్ గార్టన్, క్రిస్‌జోర్డాన్, లివింగ్‌స్టోన్, సకీబ్, మిల్స్, డేవిడ్ పైన్, అదిల్ రషీద్, జేసన్‌రాయ్, ఫిల్‌సాల్ట్, రీస్ టోప్లే, జేమ్స్‌విన్సే.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.